# పెద్దదిక్కు

వరండాలో కూర్చుని బియ్యం బాగుచేసుకుంటున్న నీలమ్మ గేటు చప్పుడుకు తలెత్తి చూసింది. చూపు కాస్త మందగించటంతో లోనికి వస్తున్న కుర్రవాడ్ని ఆనవాలు పట్టలేకపోయింది.

"నేను నానమ్మా! గుర్తుపట్టలా.... కృష్ణని" అన్నాడు దగ్గరగా నిలబడి ముసిముసి నవ్వులతో.

"ఓరి నువ్వట్రా! చూసి ఎంత కాలమైంది! ఇంతలోనే ఎంతయి పోయావురా!" అంటూ లేచి నిలబడి ప్రేమగా తడిమి చూసుకున్నది.

"ఏరా ఇంటి దగ్గర అంతా కులాసానేనట్రా?"

"ఆఁ..... బాగానే వున్నారు" చెప్పాడు కుర్చీలో కూర్చుంటూ.

నీలమ్మ లోపలకు వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చి కృష్ణకు అందించింది.

"బాబాయి, పిన్నీవాళ్ళేరి?" అడిగాడు కృష్ణ.

"ఇద్దరూ ఆఫీసులకు వెళతారుగదా. పిల్లలు బడి నుండి ఇంకా రాలేదు.... వచ్చే వేళవుతున్నట్లుంది. ఇంతకీ ఊరినుండేనా రావటం?"

"అవును నానమ్మా! మధ్యాహ్నమే బయలుదేరాను"

ఏడెనిమిదేళ్ళ క్రితం నిక్కర్లు వేసుకు తిరిగే మనవడిని పేంటులో చూస్తూ- "అప్పుడే పెద్దలాగులు వేసేస్తున్నావట్రా" అంది వింతగా.

ఆమె మాటలకు కృష్ణ ముసి ముసిగా నవ్వుకున్నాడు. "నీకు వంట్లో బాగుంటున్నదా నానమ్మా?"

"ఆఁ! ఏదో లేరా. ఇంత వయసొచ్చాక మనం అనుకున్నట్లు వుంటుందట్రా. ఏదో నెట్టుకొస్తున్నాను మరి" అన్నది భారంగా.

మెల్లగా నేలమీద చతికిలబడి బియ్యంచేట ముందుకు లాక్కుంది. "మీరంతా బాగా చదువు కుంటున్నారా?"

"నేను పదవతరగతి ఫస్టు క్లాసులో పాసయ్యాను" కృష్ణ మాటల్లో గర్వం తొంగిచూసింది.

"అలానా! గట్టివాడివే. చిన్నప్పుడు బడికి వెళ్ళాలంటే పెద్ద రాద్ధాంతం చేసేవాడివి గదరా... మరి తమ్ముడూ చెల్లాయి?"

"తమ్ముడు ఎనిమిది, చెల్లెమో ఆరో క్లాసు చదువుతున్నారే"

నీలమ్మ ముఖంలో సంతోషం తొంగిచూసింది. మనవడితో ఇంటి మంచి చెడ్డలు ఆరాలు తీస్తుండగానే కాన్వెంట్ నుండి పిల్లలు ఇద్దరూ హడావిడిగా వచ్చారు. కృష్ణకేసి బిడియంగా చూడసాగారు.

"వీడు గుర్తులేడట్రా? సిరాపూరు పెద్ద నాన్నలేడూ... పెద్దాడు కృష్ణరా!" చెప్పింది నీలమ్మ.

పిల్లలిద్దరూ తెలిసినట్లు తలయితే వూపారుగానీ లోగడ చూసిన గుర్తులేదు వాళ్ళకి. పుస్తకాల సంచులు లోపల పడేసేందుకు మెల్లగా జారుకున్నారు. అడపాదడపా పెద్దవాళ్ళ రాకపోకలేగాని కుటుంబ సమేతంగా వచ్చిపోవటాలు రెండు కుటుంబాల మధ్య ఇటీవల కాలంలో లేవు. అందుకే బంధుత్వాలున్నంత సన్నిహితంగా అనుబంధాలు పెరగలేదు.

నీలమ్మ వంటింట్లోకి వెళ్ళి పాలు వెచ్చబెట్టి ముగ్గురికీ తలాకాసిని ఇచ్చింది. కాసేపటికి పిల్లలు ముగ్గురూ ఒక చోట చేరి కబుర్లలో పడ్డారు.

నీలమ్మ వంటింట్లోకి వెళ్ళింది. కొడుకూ కోడలూ ఆఫీసునుండి వచ్చేవేళ కావస్తుండటంతో టీపొడివేసి నీళ్ళు మరగ పెడుతున్నది.

అంతలో స్కూటర్ మీద ఇద్దరూ రానే వచ్చారు.

"ఏవోయ్ కృష్ణా!ఎప్పుడొచ్చావ్!" పలకరించింది కల్పన.

"కొద్ది సేపయింది పిన్నీ" అన్నాడు.

స్కూటర్ పార్క్ చేసి వచ్చిన రాజారావు, "ఏరా! అంతా కులాసేనా?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

స్కూటర్ శబ్దం వింటూనే ఇద్దరికీ టీ కలుపుకొచ్చి ఇచ్చింది నీలమ్మ.

"ఛీ! ఏమిటిది. పానకంలా ఇంత పంచదార తగలేస్తావేం ఎన్నిసార్లు చెప్పినా" రాజారావు నీలమ్మ మీద ఇంతెత్తున లేచాడు.

ఈపాటి విదిలింపులూ, అదిలింపులూ ఆవిడ మనస్సును నొప్పించే స్థితి ఏనాడో దాటింది. ఇన్నేళ్ళ బట్టీ ఎవరు కష్టపడే మాటలన్నా మౌనంగా భరించడానికి అలవాటు పడిపోయిందామె. పౌరుషం ఇంకా అశాంతికి గురిచేస్తుందే కాని వూరటనివ్వదన్న అవగాహనకు ఆవిడ తేలిగ్గానే రాగలిగింది.

ఎంగిలి కప్పు అందుకుని ఆవిడ వెళ్తుంటే "బీన్స్ పుడకపెట్టండి" అంటూ కోడలు పురమాయించింది.

భార్యాభర్తలు బట్టలు మార్చుకుని వరండాలో వింపాదిగా పిల్లలతో కబుర్లాడసాగేరు.

రాత్రి ఎనిమిది గంటలకు వంట పూర్తయింది. అంత పనీ రొప్పుతూ రోజుతూ నీలమ్మ ఒక్కతే చేసింది. కల్పన అజమాయిషీగా వంటింట్లోకి తొంగి చూస్తుండటమేగాని ఏ పనీ ముట్టుకోలేదు. వేడినీళ్ళు పెడితే వరుసగా స్నానాలు చేశారు.

అందరికీ బట్టలు సిద్ధం చేయటం మినహా కల్పన చేసిందేం లేదు.

డైనింగ్ టేబుల్ మీద వంటకాలన్నీ సర్దిపెట్టి గానీ కాస్త వూపిరి పీల్చుకోలేక పోయింది నీలమ్మ. పని భారంతో నిస్సత్తువ ముంచుకొచ్చింది. కొద్దిసేపు పేదదేరి స్నానానికి నీళ్ళు తోడుకున్నది.

కల్పన పిల్లలకూ, కృష్ణకూ భోజనం వడ్డించింది. నీలమ్మ స్నానం చేసి వచ్చేసరికి ఎంగిలి కంచాలు సిద్ధంగా వున్నాయి. అవి కడిగి పెట్టి ఇవతలకు వచ్చింది. కొడుకూ కోడలూ భోజనం ముందు కూర్చున్నారు.

నీలమ్మకు ఆయాసంతో ఎంతో బడలికగా వున్నది. కాళ్ళు పీక్కుపోతుంటే చేతులతో పవరించుకుంటూ వుండిపోయింది. ఉదయం లేచిన దగ్గర్నుండి బండెడు చాకిరీ చేయవలసి రావటం కష్టసాధ్యమవుతున్నది.

ఈ వయస్సులో ఇంటి పనంతా ఒక్కతే చేస్తున్నందుకు సానుభూతి కూడా ఎవరికీ లేదు. అయినదానికి కాని దానికి వంకలు పెడుతూ కసురుకోవటం సాధారణం అయిపోయింది. పెద్దవాళ్ళని చూసి పిల్లలూ లోకువ కట్టారు.

పడుతున్న కష్టానికి సానుభూతి లేకపోగా నిష్ఠూరాలు భరించాల్సి వస్తున్నందుకు చాటుమాటున జేరి కళ్ళ నీళ్ళు అద్దుకోవటం మినహా నీలమ్మ చేయగలిగిందీ లేదు.

'చెట్టంత మనిషినే తీసుకెళ్ళిన భగవంతుడు నన్నెందుకు ఇలా బాధలు పెడుతున్నాడు?' అనుకుంటూ ఆవిడ కుమిలిపోని రోజుండదు.

లోపల జరుగుతున్న సంభాషణ నీలమ్మ చెవిన పడుతూనే వున్నది.

"బాబాయ్! నానమ్మను తీసుకురమ్మనే నన్ను పంపించారు" అసలు వచ్చిన పని బయటపెట్టాడు కృష్ణ.

ఆ మాటలకు నీలమ్మేకాదు రాజారావు కూడా ఆశ్చర్యపడ్డాడు. గతంలో అన్నా వదినల రాద్ధాంతం అతనింకా మర్చిపోలేదు.

"ఇప్పుడంత అవసరం ఏ మొచ్చిందిరా?" అడిగాడు రాజారావు.

"నాన్నమ్మ రోజూ నాన్నకు కలలో కనపడుతున్నదట. చూడాలని అనిపిస్తున్నదట. ఇష్టపడితే ఎప్పటికీ మా దగ్గర వుంచేసుకుంటామని చెప్పమన్నాడు"

కృష్ణ మాటలకు రాజారావు ఆలోచనలో పడ్డాడు. కల్పనకు అత్తగారు వెళ్ళిపోతుం దేమో నన్న బాధ కన్నా బండెడు చాకిరీ నెత్తి మీద పడ్తుందన్న భయం వేసింది. రాజారావు ఏమంటాడోనన్న ఉత్సుకతతో వుండిపోయారు కల్పనా, నీలమ్మ.

"మీ నానమ్మ కిష్టమయితే నాదేవుందిరా కృష్ణా! నా దగ్గరే వుండాలన్నంత పట్టుదల నాకేం లేదు. మీ నానమ్మ ఇష్టం" అన్నాడు రాజారావు.

కృష్ణకు సంతోషం వేసింది. కల్పన గుండెల్లో రాయి పడినట్లే అయింది. నిర్ణయం అత్తగారికే వదిలివెయ్యడం ఆమెకు ఏమ్మాత్రం నచ్చలేదు.

నీలమ్మ సందిగ్ధంలో చిక్కుకున్నది.

"అన్నయ్యా! గతిలేక అమ్మ నీ ఇంట్లో పడివుందేమిట్రా! అమ్మకు నీమీదా పిల్లల మీదా వున్న ఆపేక్షకొద్దీ వుంటానంటే కాదన్లేదు. మీరెంతగా ఆదరిస్తున్నారో తెలుస్తూనే వున్నది. నేను అమ్మను తీసుకెళతాను" అంటూ అన్నను చివాట్లేసి, తనను వున్నప

ళంగా వెంటబెట్టుకొచ్చిన చిన్నకొడుకే ఈనాడు తనను పంపటానికి సిద్ధపడుతున్నాడని గ్రహించిందామె.

"అత్తయ్యా! భోజనానికి లేవండి" కోడలి పిలుపుకు లోపలకు నడిచింది.

అంతదాకా వున్న ఆకలంతా అన్నం ముందు కూర్చుంటూనే చచ్చిపోయినట్లయింది. తప్పనిసరన్నట్లు నాలుగు ముద్దలు తిని అయిందనిపించింది. అంట్లన్నీ కడిగిపెట్టి వచ్చి ముందు గదిలో చాపమీద మేను వాల్చింది.

కృష్ణకూ అక్కడే మంచం వేశారు. అతడింకా కునుకు తీయలేదు. మిగతావాళ్లంతా ఎక్కడి వాళ్ళక్కడ పక్కలు సర్దుకున్నారు.

"నాతో మా వూరు వచ్చేయి నానమ్మా! అమ్మా నాన్నా మరీ మరీ చెప్పారు. ఎప్పుడో అన్న మాటలు మనస్సులో పెట్టుకోవద్దని కూడా చెప్పమన్నారు. నీకే కష్టం రాకుండా చూసుకుంటామన్నారు"కృష్ణ మెల్లగా చెప్పాడు.

నీలమ్మ అవుననిగానీ కాదనిగానీ అనలేదు. ఉన్నట్లుండి కొడుకూ కోడలూ కబురంపటమే ఆశ్చర్యంగా వుంది ఆమెకు. ఎటూ తేల్చుకోలేక ఆవిడ మనస్సు సతమతమవుతోంది.

పట్టుమని పదిహేనేళ్ళు రాకుండానే అత్త వారింట పెద్ద కోడలిగా అడుగు పెట్టింది. భర్త తర్వాత అయిదుగురు తమ్ముళ్ళున్నారాయనకు. చిన్న మరిదికి అప్పటికి తొమ్మిదేళ్ళయినా రాలేదు.

బంగారంలా పండే ముప్పయి ఎకరాల మాగాణి, మూడు జతల ఎడ్లు, ఆవులు, పాడి పంటలతో ఇల్లంతా కళకళలాడుతుండేది. అత్త నీడలో ఒక సంవత్సరంపాటు కొత్త కాపురం హాయిగానే గడిచింది. హఠాత్తుగా ఆమెగారు గుండె జబ్బుతో పోవడంతో అంత పెద్ద కుటుంబానికి నీలమ్మే పెద్ద దిక్కయింది.

చిన్న వయస్సులోనే తలకు మించిన బరువు ఎత్తుకోవాల్సి వచ్చింది. చీకట్నే లేచి పనిలో తల దూర్చితే రాత్రి మేను వాల్చేసరికి పది గంటలయ్యేది. ఇంట్లో ఎవరికేం కావాలన్నా ఆమె చూడవలసిందే. మరుదులకు తనే తల్లయింది. యంత్రంలా పని చేస్తున్నా మానసికంగా తృప్తి పొందటమేగాని శారీరక శ్రమను లక్ష్యపెట్టేది కాదు.

ఐదుగురు బిడ్డలకు తల్లయింది. తన చేతి మీదుగా మరదుల పెళ్ళిళ్ళు జరిపించింది. వాళ్ళంతా ఓ యింటివాళ్ళయ్యే సరికి సంతానం ఎదిగొచ్చింది. మామగారు పోయారు. అన్నదమ్ములు భాగాలు పంచుకుని విడిపోయారు.

కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు జరిపించారు. ముగ్గురు కొడుకుల్లో ఇద్దరికి చదువులబ్బినాయి. ఉద్యోగస్తులయినారు. బరువు బాధ్యతలు తల దించుకునేసరికి ఎకరం మాగాణి, తలదాచుకోను ఇల్లు మాత్రం మిగిలాయి. పెద్ద కొడుకు చదువురాక వ్యవసాయంలోనే వుండిపోయేడు. కొడుకుల్నీ ఓ ఇంటి వాళ్ళను చేసింది.

ఇంటి బాధ్యతలన్నీ పెద్ద కొడుక్కీ కోడలికీ అప్పగించి రామాకృష్ణా అనుకుంటూ ముక్కు మూసుకుందామనుకునేసరికి నీలమ్మ అంచనాలు తారుమారైనాయి.

పెద్ద కొడుకు ఇల్లరికం వెళ్ళాడు. మిగిలిన ఇద్దరూ ఉద్యోగస్తులు గనుక దూరంగానే వుంటున్నారు. పెద్ద కొడుకైనా ఈ వయస్సులో తోడునీడగా వుంటాడనుకుంటే ఇలా జరిగింది. దుఃఖాన్ని దిగమింగుకున్నదే కాని పెద్ద కొడుక్కి అడ్డు చెప్పలేదు.

నాలుగు దశాబ్దాల ఆమె శ్రమఫలాన్ని తలా కాస్త పంచుకుని ఎవరిదారిన వారెళ్ళిపోయారు. లంకంత ఇంట్లో భార్యభర్త లిద్దరే మిగిలారు. పచ్చగా నలుగురితో కళకళలాడుతూ వుండే లోగిలి కళాకాంతులు లేకుండా అయిపోయింది.

ఆ గాయం మానకుండానే కాలం కాకిలా మరోసారి పొడిచి ఆమె మనస్సును పచ్చిపుండు చేసింది. ముక్కూ, మూలుగూ లేకుండా నిద్రలోనే శాశ్వత నిద్రపోయాడు నీలమ్మ భర్త. అయినవాళ్ళంతా చేరి కర్మకాండలు జరిపించారు. ఆమె ఒంటరి దయింది.

కాలువగట్టున పిండాకూటికోసం కాకులు తన్నుకుంటున్న సమయంలోనే కొడుకులు ఆస్తి పంపకాలకు సిద్ధపడ్డారు. తల్లికొచ్చిన కష్టం వారికి అంతగా పట్టలేదు.

మధ్యవర్తులుగా నలుగురు పెద్దలూ చేరారు. నాలుగు సమభాగాలు చేయాలన్నారు పెద్దలు. రెండోకొడుకు మూడేభాగాలన్నాడు. 'ఆమె గతేమిటంటే?' నాలుగు నెలలపాటు ఒక్కొక్కరి దగ్గర వుంటుందన్నాడు.

పెద్ద కొడుకు పేచీ పెట్టాడు. ఇల్లు తనకే చెందాలన్నాడు. చదువుల కోసం తమ్ముళ్ళిద్దరూ బోలెడు డబ్బు తగలేశారనీ, తను చదవక చేసిన ఆదా తనకే దక్కాలనీ గొడవ చేశాడు.

అదనీ, ఇదనీ అంతా కిందా, మీదా పడ్డారు ఒక రోజంతా. వాళ్ళ మాటలు నీలమ్మ చెవిన పడుతుంటే 'ఈ బిడ్డల కోసమేనా ఇంత కాలం రెక్కలు ముక్కలు చేసుకుని ఊపిరంతా ఆవిరి చేసుకొన్నది' అనుకుంటూ కుమిలి ఏడ్చింది.

"ఏవమ్మా! ఎలా పంపకాలు చేయమంటావు?" అంటూ వచ్చిన పెద్దలతో "వాళ్ళు ఎలా కావాలంటే అలానే చేయండి" అన్నది దుఃఖిస్తూ నీలమ్మ.

పంపకాలు జరిగాయి. పొలం అమ్మిన డబ్బు అంతా సమంగా పంచుకునేట్లు, ఇల్లమ్మిన డబ్బులో సగం పెద్ద కొడుక్కి ఇవ్వటం, మిగతా సగం బ్యాంక్‌లో వేసి ఏడాదిపాటు వచ్చే వడ్డీని ఆమె ఇష్టానుసారం ఖర్చు చేసుకోవటంగా నిర్ణయించారు.

మరి ఆవిడ పోయిన తర్వాత బ్యాంక్‌లో వేసినది ఎవరికి చెందాలన్న ప్రశ్న కూడా తలెత్తింది. కర్మకాండలకు పోను మిగిలింది తలా కాస్త పంచుకోవచ్చన్నారు.

పెద్ద మనుషులు వివరాలన్నీ ఆమెకు చెబుతుంటే దుఃఖం ఆగలేదు. తన భర్త వూపిరి పోయిన ఇంట్లోనే తనదీ పోవాలని మొత్తుకుందామె. అంతవరకూ అక్కడే తలదాచుకోనివ్వమని వేడుకుంది.

పెద్ద కొడుకు అడ్డుపడ్డాడు. "అమ్మా! మేం అందరం తలోచోట వుండి నువ్వొక్క దానివి ఇక్కడెలా వుంటావు? నీ మంచీ చెడూ ఎవరు చూసుకుంటారు. చెట్టంత నాన్నే పోయాక ఇల్లెందుకు?" అంటూ ప్రాధేయపడ్డాడు.

తమ్ముళ్ళిద్దరూ అన్నను సమర్థించారు. తనతోనే వచ్చి వుండి పొమ్మని బ్రతిమిలాడాడు. ఏటికి ఎదురీదటం ఆమెకు సాధ్యం కాలేదు. పెద్ద కొడుకుతో వెళ్ళటానికి అతి కష్టం మీద ఒప్పుకున్నది.

తనదంటూ ఆ వూళ్ళో ఏమీ మిగుల్చుకోకుండానే అమ్మకు పోతున్నందుకు నీలమ్మ ఎంతగా ఆవేదన పడుతున్నదో ఎవరికీ పట్టకపోయింది.

పెద్దకొడుకింట్లో తన స్థానం ఏమిటో గ్రహించటానికి ఆమెకు ఎంతోకాలం పట్టలేదు. కొడుకే తల్లిని గౌరవం చూపనపుడు కోడలు మాత్రం ఎలా చూపెడుతుంది?

పనిమనిషిలా బండెడు చాకిరీ చేసేది. తనేం చెప్పినా, చేసినా ఎవరికీ లెక్కలేదు. చీదరింపులూ ఛీత్కారాలూ నిత్యం భరించాల్సి వచ్చేది.

ఒకరోజు ఇంట్లో పిల్లలు ఆటలాడుతూ ట్రాన్సిస్టర్ క్రింద పడేశారు. అది కాస్తా చెడిపోయింది. నీలమ్మే అందుకు కారణమన్నట్లుగా కోడలు విరుచుకుపడింది. కొడుకూ ఆమెకు వంతపాడాడు.

"ఇంట్లో తీరిగ్గా కూర్చుని తిని అరాయించుకోవటం మీకే చేతనయింది. పిల్లల్ని కని పెట్టుకు కూర్చోవటం కూడా చేతగాని మనుషుల్ని భరించటం కూడా దండగే. ఛీ......ఛీ..... ఈ మనిషికి మతిలేక నా నెత్తినెక్కించారు" అంటూ నానా మాటలనసాగింది కోడలు.

'కందిపప్పు బాగుచేస్తూ పిల్లల్ని గమనించక పోవటం తన తప్పెలా అవుతుంది?' మౌనంగా వాళ్ళ తిట్లన్నీ భరిస్తూ గుడ్ల నీరు కుక్కుకుంది.

ఆ సమయంలో అక్కడికొచ్చిన చిన్న కొడుకు ఆ తిట్లన్నీ విన్నాడు. అన్నని చెడామడా తిట్టిపోసేడు.

"వాయనా! తల్లంటే అంత ప్రేమున్న వాడివి ఇక్కడెందుకు వుంచటం? నీ ఇంటికే తీసికెళ్ళి పూజలు చేయరాదూ" అంటూ వదిన దెప్పింది.

రాజారావు పౌరుషంతో వున్నపళంగా తల్లిని బయలు దేరదీశాడు. ఇష్టంలేని చోట అవమానాలు భరించటంకన్నా కావాలని వచ్చిన చిన్నకొడుకు పంచవ చేరటమే మర్యాదనుకున్నది.

నీలమ్మ వచ్చేసరికి కల్పన నిండు గర్భిణి. పెద్దపిల్లవాడ్ని తాత గారింటిదగ్గర నుండి తీసుకొచ్చి కాన్వెంటులో చేర్చారు. కల్పన ఉద్యోగం చేస్తుండటంతో ఇల్లు కనిపెట్టుకుని వుండే పెదదిక్కు అవసరం వాళ్ళకి బాగా వున్నది.

నీలమ్మకు అన్ని విధాలా గౌరవమర్యాదలు జరుగుతున్నాయి. కల్పన ఆఫీసుకు వెళ్తే ఇంటినీ, పసివాడ్ని కనిపెట్టుకుని వుండేది. ఎవరూ ఆమె మాటకు ఎదురాడేవాళ్ళు కాదు.

చిన్నవాడికి మూడేళ్ళొస్తూనే కాన్వెంటులో చేర్చారు. నీలమ్మకు పిల్లల్ని కనిపెట్టుకు చూడాల్సిన బాధ్యత చాలావరకు తప్పిపోయింది. కుడి ఎడమగా పిల్లలు కాన్వెంటుకూ, పెద్దవాళ్ళు ఆఫీసులకూ వెళ్ళిపోయేవాళ్ళు. అలానే సాయంత్రానికి వచ్చేవాళ్ళు.

క్రమేణా రాజారావు, కల్పన ప్రవర్తనలో మార్పు రాసాగింది. తరచూ అయిన దానికీ కాని దానికీ నీలమ్మను కసురుకోవటం మొదలెట్టారు. వాళ్ళ ప్రవర్తన ఆమె మనస్సును ఎంతగా నొప్పిస్తున్నదో గ్రహించే స్థితిలో లేరు.

రెండో కొడుకు ఏడాదికోమారు చూడటానికి వస్తే గొప్పే. వచ్చినా తల్లి కష్ట సుఖాలతడికేం పట్టవు. పెద్దకొడుకును చూద్దామంటే అలాగైంది....ఎంత కాదనుకున్నా తలదాచుకోవటానికి మరో దారి లేదు గనుక పరిస్థితులకు తలవంచక తప్పలేదామెకి.

ఇన్నేళ్ళ తర్వాత పెద్ద కొడుకు నుండి కబురు రావటం ఆవిడకు వింతనిపించింది. ఎంత కాదనుకున్నా పెద్దకొడుకన్న ప్రేమ ఆమెకు లేకపోలేదు.

తెలిసీ తెలియక నాలుగు మాటలన్నంత మాత్రాన తన బిడ్డలు కాకుండా పోతారా? కావాలని కాళ్ళ దగ్గరకొస్తే 'రాను పొమ్మంటే' వాళ్ళ మనస్సు ఎంత బాధపడుతుంది?

ఈమధ్య తన పొడ ఇంట్లో ఎవరికీ గిట్టటం లేదు. పనిచేసే ఓపికా సన్నగిల్లి పోతున్నది. ఈ పట్నం బ్రతుకు విసుగ్గానూ వున్నది.

ఈ వయస్సులో కాలూ చెయ్యీ పడిపోయినా ఇక్కడ పట్టించుకునే దిక్కూ వుండదు. ఉదయం లేస్తూనే హడావిడిగా ఆఫీసులకు పరిగెడతారు. ఆ పల్లెటూళ్ళోనయితే కొడుకూ కోడలూ ఇంటిపట్టునే వుంటారు. ప్రాణం పోయేటప్పుడు ఇన్ని తులసి నీళ్ళయినా గొంతులో పోస్తారు.

చివరకు పెద్ద కొడుకు దగ్గరకు చేరటమే అన్ని విధాలా మంచిదన్న నిర్ణయానికి వచ్చింది నీలమ్మ.

అత్తగారు వెళ్ళితే ఇల్లు కనిపెట్టుకునే దిక్కు లేకుండా పోతుందని కల్పన అభ్యంతరం చెబుతుంటే రాజారావు సర్ది చెప్పాడామెకు.

"అదికాదే! ఇంతకాలం పసివాడిని కనిపెట్టుకొని ఉండటకోసం అమ్మ తప్పనిసర యింది. ఇప్పుడు ఇద్దరూ కాన్వెంట్‌కు పోతున్నారుగా! ఇక మనకు ఇబ్బంది ఏమిటి? రేపోమాపో ఆవిడ మూలబడితే ఎవరు చెయ్యగలరు చెప్పు. ఆ బాధలేవో అన్నయ్యే పడతాడు" గుసగుసలాడాడు భార్యతో. కల్పన ఆమె వెళ్ళేందుకు అభ్యంతరం చెప్పలేదిక.

మధ్యాహ్నం భోజనాలవుతూనే నీలమ్మ మనవడితో ప్రయాణమైంది. పిల్లలు మాత్రం, "మళ్ళీ ఎప్పుడొస్తావ్ నానమ్మా!" అంటూ బిక్కమొగాలేసేరు.

సాయంత్రానికల్లా ఇద్దరూ చిరావూరు చేరుకున్నారు. నీలమ్మ రాక ఇంటిల్లపాదికి ఆనందం కలిగించింది.

పెద్ద కోడలు, "అత్తయ్యా! తెలిసీ తెలీక లోగడ ఏదో వాగాను. నీది పెద్ద మనస్సు కాబట్టే మళ్ళీ మా ముఖాలు చూసేవు. ఇంకెప్పుడూ మమ్మల్ని వదలిపోనివ్వం" అంటూ వల్లమాలిన అభిమానం చూపుతుంటే నీలమ్మ ఎంతో సంతోషించింది.

"అమ్మా! పెద్దదిక్కున్న ఇంటి తీరే వేరు. నువొచ్చావు మాకంతేచాలు. నాన్నమ్మ... నాన్నమ్మంటూ పిల్లలెప్పుడూ గోలచేస్తుంటారు. నీ కోసం రావటానికి నాకే ముఖం చెల్లలేదు. పిల్లాడి ముఖం చూసయినా వస్తావన్న ఆశతోనే పంపాను" అంటూ పెద్ద కొడుకు పొంగిపోయాడు.

"నన్నేమన్నారని అంత పగ పెట్టుకుంటాన్రా. నీ పిచ్చిగాకుంటే, ఎంతయినా మీరు నా బిడ్డలు కాదూ" ప్రేమగా అన్నది నీలమ్మ కొడుకుతో.

* * * *

నెల రోజులు గడిచాయి.

కొడుకూ కోడలు నీలమ్మను అపురూపంగా చూసుకుంటున్నారు. ఏ చిన్నపనికైనా ఆవిడ సలహా తీసుకోవల్సిందే. నానమ్మంటే పిల్లలు ప్రాణం పెడుతున్నారు. జీవితంలో ఇంత కాలానికి ప్రశాంతత లభించినట్లనిపిస్తున్నదామెకు.

కాలో చెయ్యో పడిపోతే ఆదరించే దిక్కు లేదన్న బెంగ ఆమెకు ఇప్పుడు లేదు. ఈ పంచలోనే తన జీవితం దాటిపోతే చాలనుకుంటున్నది.

ఒక రోజు సాయంత్రం కబుర్లాడుతూ అంతా ఒక చోట కూర్చోనుండగా పెద్ద కొడుకు నీలమ్మతో అన్నాడు.

"అమ్మా! నువ్వేం అనుకోనంటే ఒక్కమాట. పెద్దాడు కృష్ణని కాలేజీలో చేర్పించాలనుంది. వాడికి చదువంటే చచ్చేంత శ్రద్ధ. చేతినిండా డబ్బిచ్చి వాడి మానాన వాడ్నొదిలేస్తే బస్తీలో ఏం చదువుతాడో... హొటల్ భోజనమూ పడదు. నువ్వు శ్రమను కోకుండా వాడ్ని కనిపెట్టుకుని బస్తీలో వున్నావంటే వాడి బతుక్కి ఓదారి చూపిన దానివవుతావు" ప్రాథేయపూర్వకంగా అడిగాడు.

ఆ మాటలకు నీలమ్మ గుండెలో రాయి పడినట్లయింది. 'ఇన్నాళ్ళు వీళ్ళు చూపించిన ప్రేమాభిమానాలు ఈ అవసరం కోసమేనా' అన్న ప్రశ్న ఆమె హృదయాన్ని బాధ పెట్టింది.

ఏ విధమైన స్వార్థంతోనూ తను పిల్లల్ని కనలేదు. వాళ్ళ నుండి ఏదో ఆశించి గుండెల్లో దాచుకొని పెంచలేదు.... ఈనాడూ అంతే.

ఆమె ఏం సమాధానం చెప్తుందోనన్న ఉత్సుకత అందరి ముఖాల్లోనూ కనిపిస్తున్నది. తన భవిష్యత్తు గురించిన ఆశ కృష్ణ కళ్ళలో చూడ గలిగింది.

"అలాగేరా! మీ సంతోషం కన్నా నాక్కావలసిందేమున్నది గనుక" అంటున్న నీలమ్మ కళ్ళల్లో ఉబుకుతున్న నీరు ఎవరూ గమనించలేదు.

మనవడి కనుపాపల్లో మెరుపును మాత్రం ఆమె గమనించింది.

(పల్లకి పచిత్ర వారపత్రిక, 13-3-86)